క్లుప్తంగా

కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి: మండలకేంద్రంలో గురువారం కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని కార్యకర్తలుకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు ఐక్యంగా ఉండి పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు.కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి, సర్పంచ్‌లు చిర్ర గంగాధర్ శంకర్ సత్యనారాయణ, కార్యకర్తలు చిర్ర దిలీప్, తడగొండ విజయ్, శ్రీనివాస్ చెవులమద్ది, రమేశ్, కొమురయ్య పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మేడిపెల్లి: భీమారం మండలకేంద్రంలో గురువారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేడిపెల్లి శాఖ ఆధ్వర్యంలో బ్యాంకు సేవలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, బ్రాంచ్ మేనేజర్ సంతోష్, చెక్కపల్లి రఘు, విష్ణు, వంశీ, రాజు, శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్యసాయి ట్రస్ట్‌సేవలు అభినందనీయం



సేవ ట్రస్ట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

జగిత్యాల: సత్యసాయి ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు గురువారం సిద్దిపేట జిల్లా కొండపాకలో సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాశాల, ఆస్పత్రిని సందర్శించి మాట్లాడారు. జగిత్యాల జిల్లాలో దాదాపు 30వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా రాగిజావ అందించడం అభినందనీయమన్నారు. అలాగే ట్రస్ట్ తరఫున చిన్నపిల్లలకు గుండె సంబంధిత వైద్యసేవలు జగిత్యాలలో ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే కోరగా వారు స్పందించి త్వరలోనే ఏర్పాటుచేస్తామని హామీఇచ్చారు బాలముకుందం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణం పనులు వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాయికల్: మండలంలోని కుర్మపల్లి, రాయికల్‌లో క్రీడాప్రాంగణం పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయా గ్రామాల్లోని క్రీడా ప్రాంగణం పనులను పరిశీలించారు. ఆయన వెంట ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ పంపిణీ



స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న షరీఫ్

కొడిమ్యాల: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మలబార్ గోల్డ్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్ స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 13 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.8వేల నుంచి రూ.10 వరకు మొత్తం రూ.1.06 లక్షలు స్కాలర్‌షిప్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ట్రస్ట్ కరీంనగర్ బ్రాంచ్ శాఖాధిపతి మహమ్మద్ షరీఫ్‌ను అభినందించారు. మార్కెట్ టీం సభ్యులు వై.విక్కీ, సీహెచ్. శ్రీనివాస్ అధ్యాపకులు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

రాయికల్: మండలంలోని ఇటిక్యాల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ గురువారం వీడీసీ చైర్మన్ ఏలేటి జలేందర్‌రెడ్డి ఎంఈవో గంగాధర్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

అడవి జంతువులతో అన్నదాత కుదేలు

- రైతులను బెంబేలెత్తిస్తున్న కోతులు అడవిపందులు, మనువోతులు
- పలు గ్రామాల్లో పంటలు ధ్వంసం
- పట్టించుకోని అధికారులు
- రైతులకు తీరని నష్టం
- పంటలు కాపాడాలని వేడుకోలు

మల్లాపూర్: నియోజకవర్గంలోని మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాల్లో అడవిపందులు, కోతుల సమూహాలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. ఖరీఫ్, రబీ సీజన్‌లలో పండించిన పంటలతో దిగుబడి అంతంత మాత్రమే అయినా అన్నదాతకు సాగు చేసిన పంటలు చేతికందకముందే అడవి పందులు, కోతులు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. అప్పులు తెచ్చి సాగుచేసిన పంట కళ్లముందే అటవీ జంతువులు పాడు చేస్తుంటే రైతులు వాటిని తరిమేందుకు నానావస్థలు పడుతున్నారు.



కొత్తదాంరాజుపల్లిలో ఇటీవల అడవిపందుల దాడిలో ధ్వంసమైన మొక్కజొన్న పంట

వంతుల వారీగా కాపలా..

జిల్లాలోని 380 గ్రామాల్లో సమస్య ఉన్నప్పటికీ ముఖ్యంగా అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉన్న మండలాలు, గ్రామాల్లో అటవీ జంతువుల భారినపడి అన్నదాత కుదేలవుతున్నాడు. ఆయా గ్రామాల్లోని శివారులో రైతులు సాగుచేసిన మొక్కజొన్న, వేరుశనగ,మిరపపంటలపై అడవిపందులు, మనువోతులు, కోతుల గుంపు దాడిచేసి ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈక్రమంలో పంటలను రక్షించుకునేందుకు రైతులకుటుంబ సభ్యులు వంతుల వారీగా కాపలా కాస్తున్నారు. అధికారులు స్పందించి అడవి జంతువుల భారినుంచి రైతులను కాపాడాలని కోరుతున్నారు.

దాడిచేస్తున్న మనువోతులు...

ముఖ్యంగా మల్లాపూర్ మండలంలోని రేగుంట, గొర్రెపల్లి, గుండంపల్లి, సాతారం, వెంపల్లి, వెంకట్రావ్‌పేట, ముత్యంపేట, చిట్టాపూర్ గ్రామాల్లో మొక్కజొన్న పంటను కాపాడుసుకునేందుకు కాపలా వెళ్లిన రైతులకు మనువోతుల నుంచి ప్రాణాలకు ముప్పువాటిల్లే ప్రమాదం పొంచి ఉందని కొన్ని సార్లు మనువోతులు రైతులపై దాడిచేసేందుకు యత్నించగా తప్పించుకుని ప్రాణాలు దక్కించుకుంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు.



సాతారంలో కాపలా కాస్తున్న రైతులు (ఫైల్)



కోతుల గుంపు (ఫైల్)

పట్టించుకోని అధికారులు...

గ్రామాల్లో పంటలను అడవిపందులు, మనువోతులు, కోతులగుంపు ధ్వంసం చేస్తున్నాయని రైతులు అటవీశాఖ, వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో పండించిన పంటలు దిగుబడి రాక నష్టం కలిగి ఆర్థికంగా నష్టపోతున్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించి అటవీజంతువుల నుంచి పంటలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు వేడుకుంటున్నారు.

పరిహారం పొందండిలా...

అటవీజంతువులతో పంటనష్టం వాటిల్లితే ప్రభుత్వం నుంచి పరిహారం పొందవచ్చు. దీనికి సంబంధించి 2011, ఆగస్టు 1న ప్రభుత్వం జీవో జారీచేసింది. అటవీ జంతువులతో నష్టంకలిగితే పరిహారంను అటవీశాఖ నుంచి రైతుల ఖాతాల్లో జమచేస్తారు. ఈ నష్ట పరిహారం పొందేందుకు రైతులు పంటనష్టం వాటిల్లిన వెంటనే వ్యవసాయ, అటవీ, రెవెన్యూ శాఖాధికారులకు సమాచారం ఇవ్వాలి. అటవీశాఖ అధికారులు నష్టపోయిన పంటను పంచానామా చేస్తారు. రెవెన్యూ అధికారులు నష్టపోయిన పంట ఆ రైతుదేనని నిర్ధారిస్తారు. వ్యవసాయశాఖ అధికారులు పంటనష్టాన్ని అంచానా వేస్తారు. ఈ మూడు నివేదికలను అటవీశాఖ ఉన్నతాధికారులకు పంపిస్తే నష్టపరిహారంను రైతుల ఖాతాలో జమ చేస్తారు.

కాపలా కాస్తున్నాం



మొక్కజొన్న పంటను అటవి జంతువుల భారినుంచి రక్షించుకునేందుకు ప్రతీరోజు కాపలా కాస్తున్నాం. కోతులను తరిమికొట్టినా మళ్లీ వస్తున్నాయి.

– ఏలేటి మహేశ్‌రెడ్డి, రైతు, కొత్తదాంరాజుపల్లి

ప్రాణాలకు ముప్పు



రేగుంటలో సాగుచేస్తున్న మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు కాపలా వెళితే దాడిచేస్తున్నాయి. మొక్కజొన్న పంటపై మనువోతులు, అడవి పందులు దాడిచేసి ధ్వంసం చేస్తున్నాయి.

– గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ, రేగుంట

అధికారులకు తెలపాలి



అటవీ జంతువులతో పంటనష్టం కలిగితే వ్యవసాయ, రెవెన్యూ, అటవీశాఖ అధికారులకు తెలిపితే పంటనష్టాన్ని పరిశీలించి బాధిత రైతులకు పరిహారం అందిస్తారు.

– బి.వేణుగోపాల్‌రావు, జిల్లా అటవీశాఖ అధికారి, జగిత్యాల

కంటివెలుగుతో అంధత్వాన్ని రూపుమాపుదాం



ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, ఆర్డీవో



కళ్లజోళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



కంటివెలుగు వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

కోరుట్ల/కోరుట్లరూరల్/మల్లాపూర్/పెగడపల్లి/కథలాపూర్/మేడిపెల్లి/సారంగాపూర్/కొడిమ్యాల ఇబ్రహీంపట్నం/మల్యాల /రాయికల్/వెల్గటూర్: జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల వ్యాప్తంగా గురువారం రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండోవిడత 'కంటివెలుగు' కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా 'కంటివెలుగు' పథకంతో అంధత్వాన్ని రూపుమాపాలని కోరారు. కంటి సమస్య ఉన్నవారికి ఉచితంగా మందులతో పాటు కళ్లద్దాలు, అవసరమైతే శస్త్రచికిత్సకు సిఫార్స్ చేస్తారని, పట్టణ, గ్రామీణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు ఇందుకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా కంటివెలుగు వైద్యశిబిరాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, వైద్యశిబిరంలో మౌళిక వసతులు కల్పించాలని వైద్యులను కోరారు. వైద్యులు, వైద్యసిబ్బంది శిబిరంలో కంటిపరీక్షలు చేసి మందులు అందించారు.

పశువైద్యశిబిరాలు వినియోగించుకోవాలి

ధర్మపురి: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడిజిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి కోరారు. మండలంలోని ఆకసాయిపల్లె గ్రామంలో గురువారం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ ఆధ్వర్యంలో స్థానిక పశువైద్యాధికారుల సహకారంతో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 450 పశువులు ఆవులు, గేదెలు, మేకలు, కోళ్లు తదితర వాటికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో పశువుల సంరక్షణకు ప్రభుత్వం ఉచితంగా పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రామిల్ల రమేశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ అక్కెనపెల్లి సునీల్‌కుమార్, పాలకవర్గ సభ్యులు, పశు వైద్యాధికారి రాజేందర్‌రెడ్డి తదితరులున్నారు.



మందులు పంపిణీ చేస్తున్న చైర్మన్లు

'అసత్యపు ఆరోపణలు ప్రజలు నమ్మరు'

కోరుట్ల: ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుపై కాంగ్రెస్ నాయకులు ఎన్ని అసత్యపు ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మరని బీఆర్ఎస్ నాయకులు కౌన్సిలర్లు గందం గంగాధర్, పేర్ల సత్యం, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, కల్లూర్ సర్పంచ్ అంజయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు నిత్యం ప్రజల మధ్యేఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్లపై కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. మరోమారు ఇలాంటి చర్యలకు పాల్పడితే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో కోరుట్ల పట్టణ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గుడ్ల మనోహర్, పట్టణ యూత్ అధ్యక్షుడు జాల వినోద్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

పెగడపల్లి: మండలంలోని ఆరవెల్లి, బతికపల్లి గ్రామాల్లో గురువారం ఏఈవో అశోక్, మల్లేశం రైతులతో కలిసి వరిపంటను సందర్శించారు. ప్రస్తుతం పంటలపై మొగిపురుగు ఆశించి పైరును నష్టపరుస్తున్నట్లు గుర్తించి అధికారులు సశ్యరక్షణ చర్యలపై రైతులకు ఏఈవోలు అశోక్, మల్లేశం అవగాహన కల్పించారు.

సారంగాపూర్: యాసంగి వరిలో కాండం తొలిచే పురుగు ఉధృతి అధికంగా కనిపిస్తోందని రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని బీర్‌పూర్ ఏవో జె.అనూష అన్నారు. గురువారం మండలంలోని కండ్లపల్లి, రంగసాగర్ గ్రామాల్లోని వరిపంటలను క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. కాండం తొలిచే పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. చౌడు ఏర్పడ్డ నేలలను, పొలాలను నీటిని తొలగించి ఆరబెట్టాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఏఈవోలు సందీప్, శిరీష, సర్పంచ్ పర్వతం రమేశ్, రైతులు ఉన్నారు.

బాలల పరిరక్షణ కమిటీ తనిఖీ

కథలాపూర్: మండలకేంద్రంలోని పలు దుకాణాల్లో బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు గురువారం తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో 18 ఏళ్లలోపు వారితో పనిచేయించుకుంటున్నారా అనే విషయాలను ఆరా తీశారు. బాలకార్మికులతో పనిచేయించుకుంటే య జమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఈ– శ్రమ్ కార్డుల గురించి ప్రజలకు వివరించారు. మెట్‌పల్లి సహాయ కార్మికశాఖ అధికారి అనిల్‌కదం,సభ్యురాలు రజిత, జమీల్, మదన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

గంగాగౌరి ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో పాల్గొన్న అధికారులు

మల్లాపూర్: మండలంలోని వీవీరావుపేట్ గ్రామంలోని గంగాగౌరి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. జగిత్యాల దేవాదాయ ధర్మదాయశాఖ డివిజన్ పరిశీలకుడు ఆర్. రవికిషన్, కార్యనిర్వాహక అధికారి విక్రమ్‌ల పర్యవేక్షణలో హుండీని లెక్కించారు. ఈ సందర్భంగా రూ.88,474 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది సగం ఆదాయం తగ్గిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జోగుల మమత, బిట్ల సరోజన, ఆలయకమిటీ చైర్మన్ ఎల్లాల కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ కొడిమ్యాల రవి, అర్చకులు రమేశ్, ధర్మకర్త కండెల నగేశ్ తదితరులున్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

మేడిపెల్లి: మండలకేంద్రం నుంచి కట్లకుంట వెళ్లే రహదారిలో కస్తూరిబాగాంధీ విద్యాలయం పక్కన ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు అదేదారిలో మరో రెండు చోట్ల ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ కంచె లేక ప్రమాదాన్ని తలపిస్తున్నాయి. అటుగా వెళ్లే వాహనాలతో పాటు మూగజీవాలు ట్రాన్స్‌ఫార్మర్లను తగిలే అవకాశం ఉండడంతో కంచె నిర్మించి ప్రమాదాలు నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారిపేరు : విశ్వతేజ, విద్యుత్‌శాఖ ఏఈ, మేడిపల్లి
ఫోన్ నంబర్ 9440811471

పాత్రికేయుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పెగడపల్లి: మండలంలో ఇటీవల మృతిచెందిన పాత్రికేయుడు బొమ్మెన ఎలియా కుటుంబానికి పెగడపల్లి ప్రెస్‌క్లబ్ సభ్యులు గురువారం ఆర్థికసాయం అందజేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 16న మృతి చెందాడు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్ సభ్యులు ఎలియా కుటుంబాన్ని పరామర్శించి రూ.13వేలు ఆర్థిక సాయం అందించారు.

గొల్లపల్లి: మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన కాసారపు మల్లేశం నిరుపేద బాలుడు అనారోగ్యంతో ఇబ్బంది పడుతండగా గ్రామానికి చెందిన యువకులు రూ.50వేలు ఆర్థికసాయం అందించారు. అనంతరం బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి

వెల్గటూర్: విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా దాతలు అందిస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఎంపీపీ కూనమల్ల లక్ష్మి అన్నారు. జగదేవుపేటకు చెందిన సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి కృష్ణారెడ్డి తమ తండ్రి చిన్న రాజిరెడ్డి జ్ఞాపకార్థం జగదేవుపేట ప్రాథమికోన్నత పాఠశాల, అంబేడ్కర్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో 150 మంది విద్యార్థులకు టీ షర్ట్‌లు, బెల్ట్‌లు, గుర్తింపుకార్డులు అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడల్లో, సామాజిక సేవాకార్యక్రమాల్లో ముందుండాలన్నారు. దాతలు అందించిన సహకారాన్ని ఆమె కొనియాడారు. ఎంఈవో భూమయ్య మాట్లాడుతూ.. మన ఊరు మన బడి కార్యక్రమంలో పాఠశాలల్లో వసతులు మెరుగవుతున్నాయన్నారు. అనంతరం ఇటీవల ఇండియన్ ఐకాన్ అవార్డు పొందిన సందర్భంగా ఎంఈవోను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందించారు. సర్పంచ్ గాగిరెడ్డి లింగమ్మ, ఉపసర్పంచ్ సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ సత్యనారాయణ, వైస్‌చైర్మన్ సునీత, హెచ్ఎం జీవన్‌కుమార్, సీఆర్‌పీ వైద్య వెంకటేశ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టీ షర్టులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మి

మాజీమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

మల్లాపూర్: మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మల్లాపూర్ మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి రత్నాకర్‌రావు నిరంతరం బడుగుబలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేశారన్నారు. కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేసిన రత్నాకర్‌రావుపై ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నాయకులు మల్లయ్య, కోటగిరి ఆనంద్‌గౌడ్, సోమరెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలి

ధర్మపురి: దివంగత మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావ్ అతని కుటుంబ సభ్యులపై కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో నాయకులు దినేష్ మాట్లాడారు. జిల్లా అభివృద్ధిలో ప్రజాభిమానం చూరగొన్న మాజీ మంత్రి జువ్వాడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎమ్మెల్యే మాట్లాడిన మాటలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వేముల రాజేశ్, సింహరాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ, కస్తూరి శ్రీనివాస్, శ్రీనివాస్ ఉన్నారు.

పాఠశాలలు సక్రమంగా నిర్వహించాలి

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలలను సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో గంగాధర్ అన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్ ప్రాథమిక పాఠశాలను పర్యవేక్షించి మాట్లాడారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ఉపాధ్యాయులు కొరత లేని పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యనందించాలని సూచించారు. కొన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, ఖాళీల వివరాలను ఎప్పటికప్పుడు డీఈవో దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రాథమిక పాఠశాల నిర్వహణ, పనితీరు, విద్యార్థుల్లో క్రమశిక్షణ బాగుందని కొనియాడారు. ఈ పర్యవేక్షణలో హెచ్ఎం నునావత్ రాజు, టీచర్లు షాబాజ్, గణేశ్, శ్రుతి, సునీత, లహరి, సంజన తదితరులు పాల్గొన్నారు.



అభ్యాసన తీరును పరిశీలిస్తున్న ఎంఈవో